# చిక్కుడు కాయలూ సుబ్బారావూ

చేతిలో మడిచిన గుడ్డ సంచి, రేగిన జుట్టు, పైజమా, జుబ్బా, లావుపాటి కళ్లద్దాలు- అతనెవరో తెలుసా? సుబ్బారావు అనీ, కొత్తగా ఇంటివాడయిన ఓ చిన్న ఉద్యోగి. పది నిమిషాల నుంచి, బుర్రగోక్కుంటూ కళ్లజోళ్లోంచి దిక్కులు చూస్తూ అతను అలా నిలబడే వున్నాడు అక్కడ. ఇంకా అటూ ఇటూ చూస్తూనే వున్నాడు. ఏం చెయ్యాలా అని ఆలోచిస్తూనే వున్నాడు. రోడ్డు మీద బస్సులు, కార్లూ సర్రు సర్రున జారిపోతూంటే, ఆఫీసులకి వెళ్లే వాళ్లూ స్కూళ్లకి వెళ్లే పిల్లలు ఫర్రున పారిపోతున్నారు. ఇతర వ్యాపకాల వాళ్లూ, వ్యాపారాల వాళ్లూ అడావుడిగా పరుగెత్తుతున్నారు.

ఈ సుబ్బారావు సమస్య ఏమిటీ? - అతని భార్యామణి ఓ పావు కిలో చిక్కుడు కాయలు, ఓ పావలా పచ్చి మిరపకాయలూ, ఇంకో పావలా కొత్తిమెరా తెమ్మంది. చిక్కుడు కాయల కూరయితే తొందరగా తెమిలిపోతుందనీ, కొత్తిమెరవేసి ఇంత చారు పెట్టేసి ఆఫీసుకు పంపేస్తాననీ చెప్పి, సుబ్బారావుని మార్కెట్టుకి పంపింది. సుబ్బారావు మార్కెట్టంతా తిరిగాడు గానీ, ఎక్కడా చిక్కుడు కాయలు దొరకలేదు. పైగా ఓ దుకాణంలో అడిగితే ''ఏ చిక్కుడు? గోరు చిక్కుడా? గోల్కొండ చిక్కుడా? బద్ద చిక్కుడా? గింజ చిక్కుడా?'' అని అడిగాడతను. అతని భార్య 'చిక్కుడు కాయలు' అని చెప్పిందే గాని, ఆ జాతిలో ఇన్ని కులాలున్నాయని చెప్పలేదు. పోనీ, ఏదో చిక్కుడు తీసుకుందామా అంటే, అసలా దుకాణంలో ఏ చిక్కుడూ చూడ లేదు. పోనీ, పచ్చిమిరపకాయలు, కొత్తిమెరా కొనుక్కుని పోదామా అంటే ''కూరగాయ ల్లేకుండా ఇవెందుకు తెచ్చారు? ఏం చేసుకోవాలి?'' అంటుందేమో! పోనీ, చిక్కుడుకి బదులు ఇంకేమైనా కూర, వంకాయలో, బంగాళదుంపలో, కందో, బచ్చలో తీసుకుంటే? ''ఇవెందుకు తెచ్చారూ - చిక్కుడు కాయలు తెమ్మంటే?'' అని కోప్పడుతుందేమో! తెమ్మన్నది తేవాలి గాని, తన చిత్తం ఉపయోగించకూడదు. వాళ్ల ఇబ్బందులేవో వాళ్లకుంటాయి. ఐతే, ''చిక్కుడు కాయలు లేవనుకో. అవి లేకపోతే

ఇంకేదైనా తెమ్మంటావా?'' అని తను అడిగి వుండాల్సింది. అడావుడిలో అడగలేదు; అడగడానికి టైమూలేదు. తనని బజారుకి పురమాయించి, ఆమె బాత్‌రూములో దూరిపోయింది.

ఇప్పుడు -

చిక్కుడు కాయలకని బజారంతా వెతికినా ఎక్కడా లేవు. తనో నిర్ణయం తీసుకుని ఇంకో కూర తీసుకోలేడు; ఏదీ తీసుకోకుండా ఇంటికి వెళ్లలేడు; ఏదో ఒకటి తీసుకుని వెళ్లనూలేడు. ఈ 'డైలమా'లో చిక్కుకుని చిక్కుడు కాయలు దొరక్క దిక్కులు చూస్తున్నాడు సుబ్బారావు.

ఇంకా ఇలా ఆలోచిస్తూ కూచోడం-సారీ, నిలబడ్డం – లాభం లేదనీ కార్యాచరణ సంఘాన్ని సలహా అడిగినట్టుగా ఎవర్నయినా సలహా అడగాలని మళ్లీ చరచరా బజార్లోకి వెళ్ళి ముచ్చటగా అందంగా దసరా కొలువులా వున్న ఓ పెద్ద దుకాణం దగ్గర నిలబడి, అక్కడున్న కాయగూరలన్నీ మళ్లీ పరిశీలించి, కళ్లజోడు సర్దుకుంటూ మూలమూలలా అశోకవనంలో హనుమంతుడు సీతాదేవి కోసం వెతికినట్టు తీవ్రంగా వెతక సాగాడు దుకాణదారు ప్రశ్నించేవరకూ. ''ఏం వద్దండీ. చిక్కుడు కాయలు ఈ బజార్లో ఎక్కడాలేవు. ఎక్కడ దొరుకుతాయో చెప్పగలరూ?'' అని అడిగాడు సుబ్బారావు. ''పెద్ద మార్కెట్లో దొరుకుతాయండీ. ఇంకా మీరు ఓల్ సేల్‌గా కొనాలనుకుంటే, ఇంకో పెద్ద మార్కెట్టుకూడావుంది. అక్కడికి వెళ్తే దొరుకుతాయి. ఎన్ని కిలోలు కొంటారు?'' అని అడిగాడు దుకాణదారు.

''పావుకిలో'' అన్నాడు సుబ్బారావు చాలా మొహమాట పడిపోతూనూ, సిగ్గుపడిపోతూనూ.

''ఇంతేనా! అయితే మీరు పెద్ద మార్కెట్టుకే వెళ్లండి. లేదంటే వంగ బెండ బీర ముల్లంగి కాకర మనదగ్గరున్నాయి. ఏదైనా తీసుకెళ్లండి.''

''వొద్దండీ చిక్కుడు కాయలే కావాలి''

''ఓహో! ఏదో వ్రతం ఐవుంటుంది లెండి. ఎందుకూ – మీరు వెంటనే పెద్ద మార్కెట్టుకి వెళ్లండి-దొరుకుతాయి. ఆలస్యం చేస్తే అక్కడా దొరకవు. వెంటనే వెళ్లండి''

అతని తరుముడికి సుబ్బారావు ఒక్క అంగలో బజారు బయట పడి, అక్కడి నుంచి రోడ్డు మీద పడి, పెద్ద మార్కెట్టుకేసి నడవసాగాడు. పేవ్‌మెంట్ల నిండా జనం. రద్దీ. వీళ్లని దూసుకుంటూ, తోసుకుంటూ పెద్దమార్కెట్టుకి వెళ్లడం అంటే- రైల్లో

రెండోక్లాసు పెట్టి ఎక్కినట్టే. ఐతే అయిందని ఓ రిక్షా కనిపిస్తే బేరం ఆడి అందులో ఎక్కి కూచుని, రానూపోనూ మాట్లాడాడు. ''మీరు ఎక్కువ కాయగూరలు కొంటే మాత్రం కిరాయి ఎక్కువవుద్ది సామీ'' అన్నాడు రిక్షావాడు. ''అబ్బే-పావుకిలో చిక్కుడు కాయలే'' అన్నాడు సుబ్బారావు నవ్వి. రిక్షావాడు ఏమీ అనలేదు. ''చూడూ! నా బరువు అర్వై ఆరు కిలోలనుకో, తిరిగి వచ్చేటపుడు అర్వై ఆరుంపావు అవుతుందోయ్'' అన్నాడు చమత్కారం మిళాయించి. రిక్షావాడు నవ్వలేదు గనక సుబ్బారావే నవ్వాడు.

బస్సుల్నీ లారీల్నీ తప్పించుకుంటూ, నడుస్తున్న జనాన్ని తోసుకుంటూ, సైకిళ్లను రాసుకుంటూ రిక్షా పెద్దమార్కెట్ జేరింది. 'ఐదు నిమిషాల్లో వచ్చేస్తాను-ఆగు' అని సుబ్బారావు 'కుప్పించి ఎగసిన కుండలంబుల కాంతి, చందాన - రిక్షాలోంచి ఒక్క దూకు దూకి పెద్ద బజార్లో ప్రవేశించాడు. అక్కడ ఇంకా జనం, రద్దీ. ఒకడి మాట ఒకడికి వినిపించడంలేదు. ఒకరిమాట ఒకరు వినిపించుకోడంలేదు. 'చిక్కుడు కాయలో చిక్కుడు కాయలో' అంటూ సుబ్బారావు బజారంతా తిరిగాడు. ఒకచోట మాత్రం గోరుచిక్కుడు కాయలుట – కనిపించాయి. అవి కొనాలా మానాలా అని మళ్లీ సంధిగ్ధంలో పడ్డాడు. తన భార్య 'చిక్కుడు కాయలు' అందిగాని, 'గోరు' కలపలేదు. గోరుచిక్కుడు కాయలే అయితే, అవే తెమ్మనేదిగా! పైగా ఇవి చూడ్డానికి కూడా అంత సుందరంగా లేవు. ఇవి కొని తీసుకెళ్లి మాట అనిపించుకోడం కంటె, కొనకుండా వెళ్లి మాట అనిపించుకోడం మేలు! అలా తీర్మానించుకున్నవాడై, ఆ చిక్కుడు కాయలు కొనకుండా ఇంకేదీ ఆలోచించకుండా, వట్టి సంచితో వెళ్లడం కంటె, కాస్త గట్టి సంచితో వెళ్లడం నయంగదా - అని, కొత్తిమిరా, పచ్చిమిరపకాయలూ మాత్రం కొని రిక్షాలో కూలబడ్డాడు. భార్య చెప్పినవి మూడు వస్తువులు. మూడూ తీసుకు వెళ్లకుండా వెళ్లడం భావ్యం అనిపించుకోదు. మూడింటిలో కనీసం రెండు తేవడంలో ఔచిత్యం వుంది. మెప్పువుంది – సాధనా వుంది!

చిక్కుడు కాయలు దొరికాయా అనీ, ఎలా ఇచ్చారనీ, జనం కూరగాయలు కొనలేకపోతున్నారనీ, ధరలు, ధరలతోపాటు జనాభా పెరిగిపోతున్నాయనీ, అలా... ఏదో చెప్పుకుంటూ, తొక్కుకుంటూ పోతున్నాడు రిక్షావాడు. సుబ్బారావుకి వాడి 'లెక్చరు' ఏమాత్రం ఎక్కలేదు. చిక్కుడు కాయలు తీసుకెళ్ళనందుకు భార్య ఏమంటుంది? దొరకలేదు. తనేం చెయ్యగలడు? ఆవిడ కోరినది తప్ప తక్కిన రెండు పదార్థాలూ నానా శ్రమపడీ, రిక్షాలో కూడా వెళ్లి తెచ్చాడుగదా. అంతకంటె ఏంకావాలి!

అలా ఆలోచించుకుంటూ ఇల్లు చేరి, రిక్షా దిగి, వాడికి డబ్బులిచ్చేసి పంపి, చేతి సంచితో ఇంటి గుమ్మంలోకి రాగానే తలుపుకి తాళం ఎదురైంది! సుబ్బారావు

కళ్ళజోడు తీసి, కళ్లె(రజేసి తాళంకేసి చూశాడు. 'ఇదేమిటి తాళం? ఈవిడగారు ఇంత పొద్దున్నే ఎక్కడికి షికారెళ్లింది?... నాకు ఆఫీసుకి టైమ్ కావటంలా... బొత్తిగా టైమ్ సెన్సే లేదే ఈ అడవాళ్లకి...' అనుకున్నాడు సుబ్బారావు. తర్వాత తల గోక్కున్నాడు. చిరాకుపడ్డాడు. అక్కడ బజార్లో చిక్కుడు కాయలు దొరక్క దిక్కులు చూసినట్టు ఇక్కడ కూడా భార్య జాడ తెలియక దిక్కులు చూడడం మొదలుపెట్టాడు. ఆనాడు అడవిలో సీతాదేవిని రావణుడు ఎత్తుకుపోతే, రాముడు సీత ఏమైందని చెట్టునీ పుట్టనీ గుట్టనీ అడిగాట్ట... అలా తనూ అడగాలి కాబోలు... టైమంతా వేస్టు... తను ఇంకా గడ్డం గీసుకోలేదు. స్నానం చెయ్యలేదు. ఆఫీసు టైము దాటి ఏ గంటో అయి పోయుంటుంది. ఛీఛీ.. ఏం మనిషి!... చిక్కుడు కాయలు దొరకనందుకు, భార్య ఇంటలేనందుకు, ఆఫీసుకు టైమైపోతున్నందుకు – ఇలాంటివే ఇంకో నాలుగైదు 'అందుకు'లను కలిపి, 'హోప్‌లెస్'గా మొహం చిట్లించేసుకున్నాడు. పోనీ, పక్కవాటా వాళ్ల దగ్గరకెళ్లి తన భార్య ఏమైందని విచారిస్తే?... అంతకంటె నీచం ఇంకోటుండదేమో! తనకి తెలియకుండా తన భార్య ఎక్కడెక్కడికో తిరుగుతోందన్న అభి(ప్రాయాన్ని తానే వాళ్లకి కలిగించినవాడవుతాడు!... అడగలేదు... వాళ్లే వచ్చి ''ఏం అలా నిలబడిపోయారు? మీ భార్య ఎక్కడికైనా షికారు కొట్టేసిందా పాపం'' అని అడిగితే?... ''ఇద్దరం వేర్వరు పనులమీద వెళ్లాం. నేను ముందొచ్చేశాను'' అంటాడు – దానికేం!

పరధ్యానంగా వున్న సుబ్బారావు ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు... భార్య గద్దింపుతో. ''ఏమండీ..... ఎక్కడికెళ్లిపోయారు? ఎప్పుడనగా వెళ్లారు? కాసిన్ని చిక్కుడు కాయలు కొనుక్కురావడానికి ఇంతసేపా? టైమెంతయింది?... అందరూ ఆఫీసులకి వెళ్లి అరగంట దాటింది... ఎప్పుడు వంట చేస్తాను?... ఎప్పుడు పెడతాను?... మీ రెప్పుడు వెళ్తారు?... హయ్యో - ఏం బుద్ధి?'' అంటూ ఆవిడ గుమ్మంలోనే ఎడాపెడా అక్షరోచ్చారణతో 'పూజ' చేసి, మాటలతో 'గంట' వాయించేసింది. తలుపు తాళంతీసి, అతని చేతిలోని సంచి విసురుగా లాక్కుంది.

''ఇంతసేపేమిటండీ బజారు! ఏమైపోయారోనని కంగారుమీద కంగారు పడిపోతూ నేను బజారుకి పరుగెత్తాను మీకోసం. నేనే వెళ్లి తెచ్చుకుంటే పోయేది... అసలెక్కడికి వెళ్లారు?... ఎవరితోనన్నా బాతాఖానీయా...'' అని ఇంటి లోపల గనక, 'వాయిస్ వాల్యూమ్'ని 'హై'లో పెట్టి ఇంకో దులుపు దులిపింది.

''అవునూ... నువ్వు చిక్కుడు కాయలు తెమ్మన్నావు గదా...'' అని (ప్రారంభించి జరిగిన కథంతా, దృశ్యాలతోనూ, దుకాణదారు, రిక్షావాడి పా(త్రలతోనూ పూర్తిగా వివరించాడు. అంతా విని, ఆమె 'ఏడిసినట్టుంది' అని, ఒక 'నీరస నిట్టూర్పు' విడిచి,

తలమీద చెయ్యి పెట్టుకుని, కుర్చీలో కూలబడింది. సుబ్బారావు ఆమెకు ఎదురుగా లెక్కలు రాని కుర్రాడు, టీచరు ముందు నించున్నట్టు బిక్కచూపులతో నించున్నాడు.

''చిక్కుడు కాయలు అని మాటవరసకి చెప్పానండీ... తొందరగా వేయించి మీకు వడ్డించొచ్చుగదా అని. అవి లేకపోతే ఇంకే కూరాలేదా?... లేదు! లేకపోతే వచ్చేయొచ్చు గదా అప్పుడే!... ఇంత చారూ అన్నం తిని వెళ్లేవారు.. ఆమాత్రం ఆలోచన కూడా లేకపోతే ఎలాగండీ! ఇప్పుడు నష్టపోయిందెవరు? మీరు! మీకు టైమైపోయింది... నేను అడావుడి పడాలి. పెద్ద చదువులు చదివాం... ఉద్యోగాలు చేసేస్తున్నాం... అంటే సరికాదండీ. ఈ లౌకిక విషయాలమీద కూడా కాస్త బుద్ధి ఉపయోగించండి. మీ ఆలోచన ఆఫీసులోనే కాదు - ఇలాంటి చోట్లకూడా కాస్త పెట్టండి. హయ్యో - ఎవరన్నా వింటే నవ్విపోతారు. షేవింగ్ మాట ఇవాళ వదిలేసి, తొందరగా స్నానం చేసి రండి... ఆవకాయా, కందిపొడి వేసి అన్నం పెడతాను'' అంది భార్య, కుర్చీలోంచి లేచి.

''ఐతే తప్పంతా నాదేనంటావు'' అన్నాడు సుబ్బారావు తన కంఠస్థాయిని బాగా 'లో' లో పెట్టి.

''అవును! అవును! ఇంక ఆ విషయం గురించి మాట్లాడకండి. తొందరగా స్నానం చేసి, ఆలస్యమైనందుకు ఆఫీసులో ఏం సంజాయిషీ చెప్తారో అది ఆలోచించు కోండి'' అని గబగబా వంటింట్లోకి నడిచిందామె.

ఇంతకీ ఇంత ఆలస్యానికి కారణం ఎవరు? తనేనా!... ఆమె కాదా! వివరంగా చెప్పకపోవడం ఆమె తప్పు కాదా? పోనీ, వివరంగా అడక్కపోవడం తన తప్పా?...... ఏదీ తేలక, బాత్‌రూమ్‌లో దూరిన సుబ్బారావు సబ్బుబిళ్ల కేసి చూస్తూ ''తప్పెవరిది?'' అని ఆలోచనలో పడిపోయాడు. □